# సాక్షి
## పశ్చిమగోదావరి

శుక్రవారం । 24 । నవంబర్ । 2023






**మత్స్యకారులకు అగ్రాసనం**
రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పదవుల్లో పెద్దపీట వేస్తోంది.
8లో ▸



**సన్మార్గానికి అయ్యప్ప దీక్ష**
అయ్యప్పస్వామి దీక్ష క్రమశిక్షణ వైపు నడిపించే ఆధ్యాత్మిక మార్గం. అయ్యప్ప దీక్షలకు ఏటా ప్రాముఖ్యత పెరుగుతోంది.
8లో ▸



**క్రీడా పోటీలు వాయిదా**
ఏలూరు ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను వాయిదా వేశారు.
8లో ▸

# ప్రమాదాలకు స్పాట్ చెక్

- ప్రమాదాల నివారణకు ప్రత్యేక కసరత్తు
- హైవే, రద్దీ రోడ్లలో 22 బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, అవగాహన కార్యక్రమాలు
- సత్ఫలితాలనిస్తున్న స్పెషల్ డ్రైవ్
- తగ్గిన రహదారి ప్రమాదాలు
- 22.50 శాతం తగ్గిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు



తణుకు జాతీయరహదారిపై ఉమెన్స్ కాలేజ్ సెంటర్ సమీపంలో బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన ప్రాంతం

**సాక్షి, భీమవరం:** వాహన చోదకుల నిర్లక్ష్యమో.. భద్రతా ప్రమాణాలు పాటించడంలో అధికారుల అలసత్వమో.. కారణమేదైనా రోడ్డు ప్రమాదాలు నిండు ప్రాణాలను బలిగొంటున్నాయి. అయిన వారికి తీరని శోకాన్ని మిగులుస్తున్నాయి. ఇటువంటి ప్రమాదాలపై జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రమాదాల నివారణకు చేస్తున్న ప్రత్యేక కసరత్తు సత్ఫలితాలనిస్తోంది.

**హైవేలు.. రద్దీ రోడ్లలోనే..**

2021లో జిల్లా పరిధిలో 566 ప్రమాదాలు చోటుచేసుకోగా 197 మంది, గతేడాది 619 రోడ్డు ప్రమాదాల్లో 190 మంది మృతి చెందారు. జిల్లాలో అధిక శాతం ప్రమాదాలు హైవేలు, రద్దీ రోడ్లలోనే జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రమాదాల కట్టడికి జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. హైవే అథారిటీ, రవాణాశాఖ అధికారులతో కలిసి గత మూడేళ్లలో ఐదు వరకు రోడ్డు ప్రమాదాలు జరిగిన, ఎక్కువ మరణాలు సంభవించిన 22 ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. వీటిలో తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, తణుకు రూరల్ స్టేషన్ పరిధిలో ఐదు, పెనుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, టూటౌన్ పరిధిలో ఒకటి, తాడేపల్లిగూడెం టౌన్ పరిధిలో నాలుగు, రూరల్‌లో రెండు, పెంటపాడు స్టేషన్ పరిధిలో రెండు ప్రాంతాలు ఉన్నాయి.

**ప్రమాదాల కట్టడికి..** బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, జిగ్‌జాగ్ బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుతో పాటు ఇతర రక్షణ చర్యలు చేపట్టారు. ప్రమాదాలు బారిన పడకుండా రోడ్డు సేఫ్టీపై కళాశాలలు, ఆటో స్టాండ్లు, లారీ యూనియన్ కార్యాలయాల వద్ద విద్యార్థులు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సెల్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణికులు సీటు బెల్ట్ ఆవశ్యకతను వివరిస్తున్నారు. పెద్ద ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. హైవేల్లో వాహనాలను ఆపి నిద్రమత్తు రాకుండా డ్రైవర్లతో ఫేస్‌వాష్ చేయించడం, టీ తాగించడం వంటివి చేస్తున్నారు.

**జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు**

| పోలీస్‌స్టేషన్ | ప్రమాదకర ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్) |
|---|---|
| తణుకు టౌన్ | ఓల్డ్ టోల్ ప్లాజా, ఉమెన్స్ కాలేజ్ సెంటర్ ఉండ్రాజవరం జంక్షన్, శర్మిష్టా సెంటర్ |
| తణుకు రూరల్ | వెంకయ్య కెనాల్ నుంచి తాడేపల్లిగూడెం వరకు, దువ్వ సెంటర్, విమల సెంటర్, తేతలి సెంటర్, వై.జంక్షన్ |
| పెనుగొండ | దొంగరావిపాలెం పోలీస్ ఔట్‌పోస్ట్ |
| భీమవరం వన్‌టౌన్ | పోలీస్‌బొమ్మ సెంటర్ నుంచి బుధవారం మార్కెట్ వరకు, ఓవర్ బ్రిడ్జి, ఇండియన్ పెట్రోల్ బంక్ నుంచి ఆర్టీసీ డిపో వరకు |
| భీమవరం టూటౌన్ | జడ్డు బ్రహ్మాజీ కల్యాణ మండపం నుంచి ఉండి రోడ్డు వరకు |
| తాడేపల్లిగూడెం టౌన్ | శాండీ మార్కెట్ (భీమవరం రోడ్డు), మెయిన్ ట్రాఫిక్ సెంటర్, జువ్వలపాలెం రోడ్డు, యాగర్లపల్లి రోడ్డు |
| తాడేపల్లిగూడెం రూరల్ | కమ్మ కల్యాణ మండపం సమీపం, కేఎస్ఎన్ కాలనీ ఎదురుగా |
| పెంటపాడు | ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతం, సాక్షి సెంటర్ |

### స్పెషల్ డ్రైవ్ సక్సెస్



హెల్మెట్ వినియోగంపై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

రహదారి ప్రమాదాల నియంత్రణలో స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలనిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో అక్టోబర్ నెలాఖరు వరకు 492 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 158 మంది మృతిచెందారు. గతంతో పోలిస్తే ప్రమాదాలతో పాటు మృతుల సంఖ్యను తగ్గించగలిగామని పోలీస్ అధికారులు అంటున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి గతేడాది జిల్లాలో 2,593 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 584 మాత్రమే నమోదుకావడం గమనార్హం.

**ఏ ఒక్కరి ప్రాణం పోకుండా..**

రోడ్డు ప్రమాదాల్లో ఎందరో తమ జీవితాలను కోల్పోతున్నారు. ఏ ఒక్కరి ప్రాణం పోకూడదన్న లక్ష్యంతో రోడ్డు ప్రమాదరహితంగా జిల్లాను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులు, ఆటో, లారీ, ఇతర వాహనాల డ్రైవర్లకు అవగాహన క్యాంపులు ఏర్పాటు చేసి రహదారి భద్రతపై వివరిస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. గతంలో కంటే ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తగ్గాయి. ఎంతోమంది ప్రాణాలు కాపాడగలిగాం.
–యు.రవిప్రకాష్, జిల్లా ఎస్పీ, పశ్చిమగోదావరి

స్వయంగా ఎస్పీ రవి ప్రకాష్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ స్పెషల్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు కారణాలు, నివారణ చర్యలు విశ్లేషించే విధంగా ట్రాఫిక్ ఎస్సైలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారి నివేదిక మేరకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## అర్హులందరికీ జగనన్న ఇళ్లు

**మంత్రి కారుమూరి**



ఇరగవరం జగనన్న కాలనీలో నూతన గృహ ప్రారంభోత్సవంలో మంత్రి కారుమూరి

**ఇరగవరం:** అర్హులైన ప్రతిఒక్కరికి పక్కా ఇళ్లు కట్టించి ఇస్తామని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల, వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఇరగవరం జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన లబ్ధిదారుల గృహాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా అందరికీ ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం పేదల కోసం ఇంతలా గృహాలు మంజూరు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఇంటిలో పెద్ద కొడుకుగా మారి రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో పాటు లబ్ధిదారులు మరికొంత నగదుతో ఇళ్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. అనంతరం ఇరగవరం శివారు చినరాముని చెరువులో బొక్కా రామకృష్ణ కుమారుడు వివాహ కార్యక్రమానికి ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అదే గ్రామానికి చెందిన శీనబోయిన సత్యనారాయణ కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురికాగా వెళ్లి పరామర్శించారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబానికి అన్నివిధాలుగా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

### న్యూస్‌రీల్

**టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం**



బీసీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

**పెనుగొండ:** గత టీడీపీ ప్రభుత్వంలో మాటలు తప్ప జరిగిన అభివృద్ధి శూన్యమని రాష్ట్ర మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని ములపర్రు గ్రామంలో మారెమ్మ గుడి వద్ద రూ.25 లక్షల నిధులతో బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. పితాని వారిపాలెంలో దాదాపు రూ.80 లక్షల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని గుర్తుచేశారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టీడీపీ నాయకులు అందినకాడికి దోచుకుని ఇప్పుడు దూరప్రాంతాలకు వెళ్లి దాక్కున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో గ్రామాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేకపోయాయని, ప్రజలంతా గమనించాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, సొసైటీ చైర్మన్ యాండ్ర మంగాదేవి, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా అరుణ, బీసీ నాయకులు పితాని సత్యనారాయణ, యాండ్ర శ్రీనివాస్, కాండ్రేకుల కామేశ్వరరావు, యాండ్ర వెంకన్న, కడలి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**మత్స్యకారుల పాలిట దైవం సీఎం వైఎస్ జగన్**



పూర్ణచంద్రరావు

**భీమవరం అర్బన్:** మత్స్యకారులకు ఏ సమస్య వచ్చిన వెంటనే స్పందించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి పాలిట దైవమని జాతీయ మత్స్యకార సంఘం వైస్ చైర్మన్, రాష్ట్ర అగ్ని, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం జరిగిన 24 గంటల్లోనే సీఎం జగన్ స్పందించి పూర్తిగా దగ్ధమైన 30 బోట్లను వాటి ఖరీదును దృష్టిలో పెట్టుకుని 80 శాతం నష్టపరిహారాన్ని అందించి ఆదుకున్నారని పేర్కొన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న 19 బోట్లకు, బాధిత మత్స్యకారులు 480 మందికి రూ.7 కోట్ల 11 లక్షల 76 వేలు చెక్కును మంత్రి సీదిరి అప్పలరాజు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ చేతులమీదుగా అందించి అండగా నిలిచారని తెలిపారు. అలాగే ఏటా వేట నిషేధ సమయంలో రూ.10 వేల సాయం, బోట్లకు డీజిల్ సబ్సిడీ, మత్స్యకారులకు పెన్షన్లు, కార్పొరేషన్ ఏర్పాటు, ఫిషింగ్ హార్బర్లు నిర్మాణం వంటివి చేపట్టారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో హుద్‌హుద్ తుపానుకు 34 బోట్లు ధ్వంసమైతే మత్స్యకారులకు అతి తక్కువ నష్ట పరిహారం అందించారని తెలిపారు. మత్స్యకారుల కార్పొరేషన్ ఏర్పాటు కోసం చంద్రబాబును కోరితే చులకనగా మాట్లాడారని పేర్కొన్నారు. అయితే సీఎం జగన్ రాష్ట్రంలో మత్స్యకారులకు ఏ కష్టమొచ్చినా నేనున్నాంటూ అండగా ఉంటున్నారని కృతజ్ఞతలు తెలిపారు.

**25న జాబ్‌మేళా**

**కొయ్యలగూడెం:** కొయ్యలగూడెం ప్రభుత్వ హైస్కూల్‌లో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు తెలిపారు. మోండలేజ్ ఇండియా– క్యాడ్‌బరీ చాక్లెట్ తయారీ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

## ఘనంగా నరసన్న కల్యాణం





కల్యాణ తంతు జరిపిస్తున్న పండితులు, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

**పెంటపాడు:** పెంటపాడు గ్రామ ఇలవేల్పు, వెలమ సంక్షేమ సంఘ ఆరాధ్య దేవత గౌరీ దేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆలయం వద్ద సింహాచలం వరాహ నృసింహస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై నరసింహస్వామి కరుణ, కటాక్షాలు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. స్వామివారి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ముందుగా మంత్రి కొట్టు గౌరీ దేవి అమ్మవారిని దర్శించారు. రూ.కోటి నిధులతో చేపట్టిన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా, గజమాలతో సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, యువనేత కొట్టు విశాల్, కర్రి భాస్కరరావు, ఎంపీపీ దాసరి హైమావతి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిలపర్తి వెంకట్రావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ దాసరి అప్పన్న, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, పార్టీ నాయకులు, వెలమ సంక్షేమ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 383 మందికి కల్యాణమస్తు, షాదీ తోఫా

**రూ.2.74 కోట్ల నిధుల జమ**



భీమవరం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

**భీమవరం(ప్రకాశం చౌక్):** వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా నాల్గో విడత (జూలై–సెప్టెంబరు 2023 త్రైమాసికం)లో జిల్లాలో 383 జంటలకు రూ.2 కోట్ల 74 లక్షల 40 వేలు లబ్ధి చేకూర్చినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. తాడేపల్లి నుంచి సీఎం జగన్ ప్రారంభించిన వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి వర్చ్యువల్‌గా వీక్షించిన అనంతరం లబ్ధిదారులకు శాసనమండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్‌తో కలిసి ఆమె చెక్కు అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బీసీకి చెందిన 204 జంటలకు రూ.50 వేల చొప్పున రూ.1.02 కోట్లు, 22 బీసీ ఇంటర్ క్యాస్ట్ జంటలకురూ.75 వేల చొప్పున రూ.16.50 లక్షలు, 11 భవన నిర్మాణ కార్మికుల పిల్లల జంటలకు రూ.40 వేల చొప్పున రూ.4.40 లక్షలు, 5 దివ్యాంగ జంటలకు రూ.1.50 లక్షల చొప్పున రూ.7.50 లక్షలు, 6 మైనార్టీ జంటలకు రూ.లక్ష చొప్పున రూ.6 లక్షలు, 117 ఎస్సీ జంటలకు రూ.లక్ష చొప్పున రూ.1.17 కోట్లు, 14 ఎస్సీ ఇంటర్ క్యాస్ట్ జంటలకు రూ.1.20 లక్షల చొప్పున రూ.16.80 లక్షలు, 3 ఎస్టీ జంటలకు రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు, ఒక ఎస్టీ ఇంటర్ క్యాస్ట్ జంటకు రూ.1.20 లక్షల చొప్పున రూ.1.20 లక్షలు అందజేశారు. కళ్యాణమస్తు, షాదీ తోఫా ఆర్థిక లబ్ధిను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, బీసీ వర్గాలకు ఈ పథకం బాగా ఉపయోగపడుతుందన్నారు. పథకం ద్వారా లబ్ధి పొంది ఆర్థికంగా, సామాజికపరంగా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. శాసనమండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ సీఎం జగన్ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అమ్మాయిల వివాహ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఈ ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాలు అధికారి కేసీహెచ్ అప్పారావు, సీపీఓ కె.శ్రీనివాసరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ వేణుగోపాల్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ అధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

## తెప్పోత్సవానికి సర్వం సిద్ధం



ముస్తాబవుతున్న తెప్ప

**ద్వారకాతిరుమల:** ద్వారకాతిరుమల చినవెంకన్న పుష్కరిణి (నృసింహ సాగరం)లో శుక్రవారం రాత్రి జరుగనున్న చినవెంకన్న తెప్పోత్సవానికి సర్వం సిద్ధమైంది. దీనిలో భాగంగా ఉభయ దేవేరులతో స్వామివారు విహరించనున్న తెప్పను హంస వాహనంగా అలంకరిస్తున్నారు. అలాగే తెప్పలో పచ్చిపూల మండపాన్ని నిర్మిస్తున్నారు. భక్తులకు రక్షణ కల్పించేలా పుష్కరిణి గట్లపై ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేయడం, సాగరం ముందు స్వామి వారి భారీ విద్యుత్ కటౌట్‌ను నిర్మించడం వంటి పనులు గురువారం జరిగాయి. ఇప్పటికే పుష్కరిణి మధ్యలో ఉన్న మండపాన్ని, సాగరం గట్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుష్కరిణి పరిసరాలు విద్యుద్దీప కాంతులతో మిరమిట్లు గొలుపుతున్నాయి. ఇదిలా ఉంటే స్వామి, అమ్మవార్లు ఆలయం నుంచి తొళక్క వాహనంపై బయలుదేరి పుష్కరిణి వద్దకు రాత్రి 8 గంటల సమయానికి చేరుకుంటారని, ఆ తరువాత తెప్పోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

**పరిశ్రమల కేంద్రం జీఎంగా ఆదిశేషు**

**ఏలూరు(మెట్రో):** ఏలూరు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌గా వి.ఆదిశేషు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయన కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కలిసి పూలమొక్క అందజేశారు. భీమవరంలో డీఐసీ డిప్యూటీ డైరెక్టర్, జనరల్ మేనేజర్‌గా ఉన్న ఆదిశేషు పదోన్నతిపై ఏలూరుకి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఉన్న జె.నాగరాజు వైఎస్సార్ జిల్లా ఏపీఐఐసీకి బదిలీపై వెళ్లారు.

## శుభకరా.. సోమేశ్వరా



భీమవరం గునుపూడిలోని పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)లో గురువారం ప్రత్యేక అభిషేకాలు, లక్షపత్రి పూజలు జరిగాయి. ఉదయం విశేష పూజల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానానికి ఒక్కరోజు ఆదాయం రూ. 21,414 సమకూరినట్టు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు.
– భీమవరం (ప్రకాశంచౌక్)



పాలకొల్లులో సప్తనదీ జలాలతో ఊరేగింపుగా వెళుతున్న అయ్యప్పలు, మహిళలు

## వైభవం.. సప్తనదీ జలాభిషేకం



స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

**క్షీరారామంలో వేడుక**

**పాలకొల్లు సెంట్రల్ :** కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పంచారామక్షేత్రం పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో గురువారం సప్తనదీ జలాభిషేక వేడుక నేత్రపర్వంగా జరిగింది. పట్టణంలోని నరసాపురం రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకుడు బాబుల్ గురుస్వామి ఆధ్వర్యంలో కెల్లక బ్రదర్స్ 1,116 కలశాలతో సప్తనదుల జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అభిషేకాలు చేశారు. కెల్లక బ్రదర్స్ సింధు, గంగా, యమున, నర్మద, కావేరి, గోదావరి తదితర నదుల నీటిని స్వయంగా తీసుకువచ్చి ఈ వేడుకను జరిపించినట్టు బాబుల్ గురుస్వామి అన్నారు. ముందుగా అయ్యప్ప స్వాములు, గోవింద స్వాములు, శివ భక్తులు, మహిళలు కలశాలలో నదీ జలాలతో ఊరేగింపుగా క్షీరారామం చేరుకున్నారు. సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు వాయిదా

ఏలూరు (టూటౌన్) : అంర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించ తలపెట్టిన క్రీడా పోటీలను వాయిదా వేసినట్లు విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు పి.రాకడ మణి గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న గురువారం కురిసిన భారీ వర్షం వల్ల సదరు పోటీలను వాయిదా వేసినట్లు తెలిపారు.

### గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

భీమవరం: భీమవరం పట్టణంలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిందని వన్‌టౌన్ ఏఎస్‌ఐ రామకృష్ణ గురువారం చెప్పారు. ఆగస్టు 14న పట్టణంలోని కేఎల్‌ఎం షాపింగ్ మాల్ వద్ద గుర్తుతెలియని 80 ఏళ్ల వృద్ధురాలు స్పృహతప్పి పడిపోవడంతో స్థానికులను ఆమెను ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు.



# మత్స్యకారులకు అగ్రాసనం

- జగనన్న పాలనలో పదవుల్లో పెద్దపీట
- కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్న టీడీపీ ప్రభుత్వం



నరసాపురం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం.. మరోవైపు వశిష్ట గోదావరి తీరం.. ఇది నరసాపురం ప్రాంతం ప్రత్యేకత. సముద్రం, గోదావరిపై వేటనే ప్రధాన జీవనాధారం చేసుకుని తరతరాలుగా మత్స్యకారుల ఇక్కడ జీవిస్తున్నారు. నరసాపురం నియోజకర్గంలో 70 వేలకు పైగా మత్స్యకార జనాభా ఉంది. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న మత్స్యకారులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే గత టీడీపీ ప్రభుత్వం వాడుకుంది. స్థానిక సంస్థల్లోగాని, నామినేటెట్ పోస్టుల్లో గాని వారికి సరైన ప్రాధాన్యత ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారులను ఆర్థికంగా, రాజకీయంగా అందలం ఎక్కించే చర్యలు చేపట్టారు. స్థానిక సంస్థల్లో, కార్పొరేషన్ పదవుల్లో, పార్టీ పదవుల్లో కూడా మత్స్యకారులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో మత్స్యకార వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మత్స్యకార అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నరసాపురం మండలం వేములదీవి గ్రామానికి చెందిన మత్స్యకార నేత తిరుమాని నాగరాజును నియమించింది. మత్స్యకారుల అభివద్ధి, సంక్షేమం విషయంలో ఇది ఒక భాగం మాత్రమే. గత మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మత్స్యకార మహిళ బర్రి శ్రీవెంకటరమణకు మున్సిపల్ చరిత్రలో మొదటిసారిగా అవకాశం ఇచ్చి చైర్‌పర్సన్‌గా కూర్చోబెట్టింది. మొగల్తూరు జెడ్పీటీసీగా మత్స్యకారుడు తిరుమాని బాబ్జీకి అవకాశం ఇచ్చారు. మత్స్యకారులు అధికంగా ఉన్న తీరగ్రామాల్లో అన్ని చోట్లా మత్స్యకారులను సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా వైఎస్సార్‌సీపీ నిలబెట్టించింది.

**నామినేటెడ్ పదవుల్లోనూ అందలం..**

నామినేడెట్ పదవుల్లోను మత్స్యకారులకు పెద్దపీట వేశారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా మత్స్యకార మహిళ బర్రి లీలను నియమించారు. తాజాగా మత్స్యకార అభివద్ధి కమిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా తిరుమాని నాగరాజును నియమించారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ముత్యాలపల్లికి చెందిన బందన పూర్ణచంద్రావు ఉన్నారు. మరో మత్స్యకారనేత మైల వీర్రాజును అగ్నికుల క్షత్రి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. జిల్లా మత్స్యకార సొసైటీ సంఘం అధ్యక్షుడిగా అండ్రాజుల చల్లారావు కొనసాగుతున్నారు. 2004లో వైఎస్ రాజశేఖరెడ్డి ముఖ్యమంత్రి అయ్యే వరకూ మత్స్యకారులను కనీసం పట్టించుకున్న పరిస్థితిలేదు. అప్పట్లో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నర్సాపురం ఏఎంసీ చైర్మన్ స్థానంలో మత్స్యకారుడు రేవు సాంబమూర్తిని కూర్చోపెట్టారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే గంగపుత్రులకు తగిన గుర్తింపు లభించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా మత్స్యకారుడు బర్రి శంకరం కొనసాగుతున్నారు. పార్టీ మొగల్తూరు మండల అధ్యక్షుడిగా మత్స్యకారుడు కర్రి ఏసుబాబు కొనసాగుతున్నారు.

**బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్**

ప్రతి జిల్లాలో ఒక ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయంలో భాగంగా నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఆక్వా యూనివర్సిటీ నిర్మాణం ప్రారంభమైంది. ప్రభుత్వ ఛీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు నరసాపురం పట్టణం పార్కులో ఉపయోగంలో లేని ఫిష్ మార్కెట్ భవనాన్ని దాదాపు రూ.2 కోట్లతో మత్స్యకార కల్యాణ మండపంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.

### చైర్‌పర్సన్ అవుతానని ఊహించలేదు



మత్స్యకార మహిళనైన నాకు మున్సిపాలిటీ పీఠంపై కూర్చునే చాన్స్ వస్తుందని కలలో కూడా ఊహించలేదు. మత్స్యకారులకు గతంలో ఏపార్టీ అవకాశం ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మొదటి సారిగా అవకాశం ఇచ్చి గెలిపించారు. వైఎస్సార్‌సీపీ మేలును మత్స్యకారులు మరువలేరు.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

### మత్స్యకారులంతా రుణపడి ఉంటాం



ముగ్గురు మత్స్యకారులకు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడం, ఇద్దరిని ఎమ్మెల్యేలు చేసి వారిలో ఒకరికి మంత్రి ఇవ్వడం గతంలో లేదు. ఒకరిని రాజ్యసభకు పంపారు. నరసాపురం నియోజకవర్గంలో అనేక మందికి రాష్ట్ర కార్పొరేషన్ పదవులు ఇచ్చి ముదునూరి ప్రసాదరాజు గొప్ప నిర్ణయాలు తీసుకున్నారు. మత్యకారులంతా రుణపడి ఉంటాం.

– బర్రి జయరాజు, కౌన్సిలర్

### మత్స్యకారులకు గౌరవం ఇచ్చారు



మత్స్యకారులకు గౌరవం ఇచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారుల అభివద్ధి, సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నారు. హార్బర్ల నిర్మాణాలు, వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచడం వంటి చర్యలు మరువలేరు. మత్స్యకార సొసైటీ అభివృద్ధికి కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

– అండ్రాజు చల్లారావు, మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు

### మత్స్యకారులకు గర్వంగా ఉంది



గత ప్రభుత్వాలు మత్స్యకారులను పట్టించుకోలేదు. మమ్మల్ని రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూనుకున్నారు. రాష్ట్రంలో మత్స్యకారుల జనాభా 80 లక్షల వరకూ ఉంది. మమ్మల్ని టీడీపీ ఓటు బ్యాంకుగా వాడుకుంది. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌ను, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజును చూస్తుంటే గర్వంగా ఉంది.

– తిరుమాని నాగరాజు, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్

## నైతిక విలువలను పెంచుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి

తాడేపల్లిగూడెం: విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నిట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భారత ప్రభుత్వ ఆధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఇటీవల ప్రారంభించిన ఒక జిల్లా ఒక ఉత్పత్తి కార్యక్రమంపై నిట్ విద్యార్థులు గూడెం చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు మత్స్య సంపద, ఆహార ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు గురువారం నిట్ సెమినార్ హాలులో సర్టిఫికెట్లను అందచేశారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాంతీయ ఉత్పత్తులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పనిచేయడంలోనే ఆనందాన్ని వెదక్కుంటూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలన్నారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్, ఆచార్యులు వి.సందీప్, టి.రేష్మా పాల్గొన్నారు.

## రేపు హెల్త్ వర్సిటీ వాలీబాల్ టీమ్ సెలక్షన్స్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 8 నుంచి 12 వరకు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ (మహిళలు) టోర్నమెంట్ నిర్వహిస్తారు. ఈ టోర్నీలో పాల్గొనేందుకు డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ తరఫున ప్రాతినిధ్యం వహించే జట్టును ఈ నెల 25న ఎంపిక చేయనున్నారు. ఏలూరులోని ఆశ్రం మెడికల్ కళాశాల ఆవరణలో ఈ ఎంపికలు ఉంటాయని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఈ.త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలల్లోని మహిళా క్రీడాకారులు ఆరోజు ఉదయం 10 గంటలకు ఏలూరులోని ఆశ్రం కళాశాలలో రిపోర్ట్ చేయాలని కోరారు.



## వేధింపులు తాళలేక ఆత్మహత్య

భీమవరం: భర్త వేధింపులు భరించలేక మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని భీమవరం వన్‌టౌన్ ఎస్సై హనుమంతరావు గురువారం చెప్పారు. భీమవరం పట్టణం గరువుపేటకు చెందిన కుంచెనపల్లి శరత్, పాలకొల్లు మండలం జొన్నలగరువు గ్రామానికి చెందిన స్వరాజ్యం(32)కు 2016లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ. 2 లక్షల నగదు, ఇతర లాంఛనాలు ఇచ్చారు. వీరికి ఒక బాబు జన్మించాడు. అనంతరం ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు రావడంతో స్వరాజ్యం విడిగా ఉంటోంది. బుధవారం స్వరాజ్యం తల్లి మేడపాటి జయలక్ష్మి కుమార్తె ఇంటికి రాగా ఇద్దరు రాత్రి నిద్రపోయారు. గురువారం తెల్లవారుజామున మంచంపై స్వరాజ్యం లేకపోవడం పక్కగదిలో చీరతో ఉరివేసుకుని చనిపోయి ఉండడాన్ని గమనించిన జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఫార్మసీలో 60 సీట్లు అందుబాటులో

తాడేపల్లిగూడెం: ఆదికవి నన్నయ్య గూడెం ప్రాంగణంలో ఈ విద్యాసంవత్సరంలో బీ ఫార్మసీలో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ గురువారం తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం ఇచ్చిందన్నారు. 2019లో 60 మంది విద్యార్థులతో ప్రాంగణంలో ఫార్మసీ విభాగం ప్రారంభించామన్నారు.



# సన్మార్గానికి అయ్యప్ప దీక్ష

- కఠిన నియమాలే జీవిత ఉన్నతికి సోపానాలు
- దీక్షా నియమాలతో వ్యక్తిత్వ వికాసం
- జిల్లాలో ఏటా పెరుగుతున్న అయ్యప్ప దీక్షాధారులు



బుట్టాయగూడెం: అయ్యప్పస్వామి దీక్ష క్రమబద్ధమైన జీవనం విధానం నేర్పి దురలవాట్ల నుంచి విముక్తి కలిగిస్తుంది. క్రమశిక్షణ వైపు నడిపించే ఆధ్యాత్మిక మార్గం. అయ్యప్పస్వామి మాలధారణకు ప్రతిఏటా ప్రాముఖ్యత పెరుగుతోంది. హరిహరాదులకు ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసంలో మాలధారణ చేస్తున్నారు. అయ్యప్ప దీక్షపై యువత ఎక్కువ శాతం ఆసక్తి చూపుతోంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 16 వేల మందికి పైగా స్వామిమాల ధరించినట్లు సమాచారం. దీక్ష చేపట్టిన స్వాములు ఇప్పటికే అనేక మంది రాజమండ్రి సమీపంలో ఉన్న ద్వారపూడి, జంగారెడ్డిగూడెం సమీపంలోని గుర్వాయిగూడెం వద్దున్న అయ్యప్పస్వామి ఆలయాల్లో స్వామి వారికి ఇరుముడులు చెల్లించి దీక్షలు విరమించారు. శబరిమల వెళ్లే స్వాములు త్వరలో కొందరు వెళ్లనుండగా.. జనవరి 3న మండల దీక్ష దర్శనం కోసం మరికొందరు బయల్దేరి వెళ్తున్నారు. మరికొందరు స్వాములు జనవరి 14న జ్యోతి దర్శనానికి వెళ్తున్నారు. బ్రహ్మచర్యం, చన్నీటి స్నానం, దీపారాధనలు, అయ్యప్ప శరణు ఘోష, సాత్వికాహారంతో భక్తులు ముందుకుసాగుతున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 14 నుంచి 16 వేల మంది వరకూ స్వామి దీక్ష స్వీకరించినట్లు సమాచారం. వీరిలో 30 నుంచి 45 ఏళ్ల వయసు వారు 50 శాతం ఉంటే వీరిలో యువకులు 30 శాతం వరకూ ఉన్నారు.

**స్వాముల పేర్లు ఇలా**

- కన్నెస్వామి– మొదటి సారి దీక్ష
- కత్తి స్వామి– రెండో సారి దీక్ష
- గంట స్వామి– మూడో సారి దీక్ష
- గద స్వామి– నాలుగో సారి దీక్ష
- పెరు స్వామి– ఐదోసారి దీక్ష
- గురు స్వామి– ఆరో సారి దీక్ష

**అన్నప్రసాదం**

అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు కొంతమంది సొంతంగా వండుకుంటారు. వండుకోవడం సాధ్యంకానివారి కోసం అయ్యప్పస్వామి ఆలయ కమిటీలు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. ప్రతీ ఏటా కార్తీకమాసం మొదలుకొని మకరజ్యోతి వరకూ అన్నదాన కార్యక్రమాలు జరుగుతుంటాయి.

**దీక్ష నియమాలు**

- ప్రతీరోజూ వేకువనే చన్నీటి స్నానం చేయాలి.
- మంత్రమాలను ఎట్టి పరిస్థితుల్లో తీయరాదు.
- శబరిమల వెళ్లే భక్తులు 41 రోజుల దీక్షను కచ్చితంగా పాటించాలి.
- సన్నిధానంలో పదునెట్టంబడి ఎక్కే సమయానికి 41 రోజులు పూర్తి కావాలి.
- నలుపు లేదా నీలి రంగు దుస్తులు ధరించాలి (మొదటి సారి దీక్ష స్వీకరించిన కన్నె స్వాములు కచ్చితంగా నలుపు దుస్తులు ధరించాలి)
- కాళ్లకు చెప్పులు ధరించరాదు
- ప్రతీ స్త్రీని(భార్యను సైతం) దేవీ స్వరూపులుగా భావించాలి.
- తన పేరు చివర అయ్యప్పను కలుపుకోవాలి.
- దీక్ష కాలంలో ముఖ క్షవరం, కేశ ఖండన, గోళ్ల తీసుకోకూడదు. ఎవరైనా భిక్షకు పిలిస్తే తిరస్కరించకూడదు.
- రోజుకు ఒక పూట మధ్యాహ్నం మాత్రమే భోజనం చేయ్యాలి. రాత్రి అల్పాహారం మాత్రమే తీసుకోవాలి.
- ఉదయం పాలు, పండ్లు మాత్రమే ఆరగించాలి. అల్పాహారం తినకూడదు.
- మెత్తటి పరుపులు, దిండ్లు ఉపయోగించకూడదు. నేలమీద చాపపై విశ్రమించాలి.
- పగటిపూట నిద్రపోరాదు.
- ఎల్లప్పుడూ విభూతి, చందనం, కుంకుమ బొట్టుతో ఉండాలి.
- మద్యం, మాంసం, ధూమపానం, తాంబూలం నిషేధం.
- ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం గుడికి వెళ్లాలి.

**ఇరుముడి అత్యంత ప్రాధాన్యం**

దీక్షలో 41 రోజుల తర్వాత చేసే ఇరుముడికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఇరు అంటే రెండు అని అర్థం. అనగా రెండు ముడులు. మొదటి ముడిలో పీఠం, భస్మం, గంధం, కొబ్బరికాయలు, నెయ్యి, పూజా సామాగ్రి ఉంటాయి. రెండో ముడిలో ప్రయాణానికి కావాల్సిన వస్తువులు ఉంటాయి.

**శబరిమలకు ఆర్టీసీ బస్సుల ప్రయాణం**

దీక్షధారులు ఒక బృందంగా ఏర్పడి ఆర్టీసీ లేదా ప్రైవేటు బస్సులను సంప్రదిస్తే శబరిమలకు బస్సు సౌకర్యం కల్పిస్తారు. కిలోమీటర్ ప్రకారం చార్జీలు వసూలు చేస్తారు. ప్రైవేటు ట్రావెల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్యాకేజీల ప్రకారం ప్రత్యేక బస్సులు నడుపుతారు.

**రైల్వే ప్రయాణం**

శబరిమల అయ్యప్పను దర్శించుకోవడానికి రైలు మార్గం అత్యంత తక్కువ ఖర్చుతో కూడింది. విజయవాడ నుంచి కొట్టాయం మీదుగా చెంగులూరు స్టేషన్‌లో దిగి కేరళ ఆర్టీసీ బస్సులు, స్వాములను పంపా నది, ఎరిమేలి, తదితర ప్రాంతాలకు తీసుకువెళ్ళేందుకు సిద్ధంగా ఉంటాయి.

**విమాన ప్రయాణం**

శబరిమలకు విమానం ద్వారా వెళ్ళడానికి అవకాశం ఉంది. గన్నవరం, హైదరాబాదులోకి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి కొచ్చిన్ వెళ్లవచ్చు. లేదా బెంగుళూరు నుంచి కొచ్చిన్ వెళ్లవచ్చు. అక్కడి నుంచి పంపాకు వాహనాలు ఉంటాయి.

### సేవా భావం పెంపొందుతుంది



నేను సుమారు 20 సంవత్సరాల నుంచి దీక్షను స్వీకరించి శబరిమలకు వెళ్తున్నాను. మేము 30 మంది బృందంగా ఏర్పడి దీక్షను ఆచరిస్తున్నాం. నియమనిష్ఠలతో చేస్తున్న అయ్యప్ప దీక్ష వల్ల చక్కటి సేవా భావం కూడా కలుగుతుంది. హరిహర సుతుడు అయ్యప్పస్వామి అవతారం ఒక అద్భుతం. దీక్ష చేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

– ఉండవల్లి సురేష్, అయ్యప్ప మాలధారి, బుట్టాయగూడెం

### ప్రత్యేక జీవన విధానం



దీక్షను స్వీకరించినన్ని రోజులూ జీవన విధానంలో ప్రత్యేకత ఉంటుంది. నియమ నిష్ఠలతో నిత్యం అయ్యప్పను స్మరించడం ఉదయం, సాయంత్రం ఆలయంలో పూజ చేయడంతో ఆధ్యాత్మిక ప్రశాంతత కలుగుతుంది. ప్రతి ఒక్కరితో ప్రశాంతత చిత్తంతో మాట్లాడటం పూజలు, భజనల కార్యక్రమాల్లో పాల్గొనడంతో మనసు ప్రశాంతంగా ఉంటుంది.

– దండాబత్తుల ఫణి కుమార్, అయ్యప్ప మాలధారి, బుట్టాయగూడెం మండలం

## కీచక టీచర్ అరెస్టు



నిందితుడు సోమరాజు(ఫైల్)

ఉండి: మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికను ప్రేమపేరుతో మోసగించి, బాల్య వివాహం చేసుకున్న కీచక టీచర్ పురెళ్ల సోమరాజును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దీనిపై ఉండి పోలీస్‌స్టేషన్‌లో దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎన్.మురళీకృష్ణ ప్రెస్‌మీట్ నిర్వహించి వివరాలను తెలిపారు. పాఠశాలలో చదువుతున్న బాలికకు ఉపాధ్యాయుడు ఆమెను 19న రాత్రి ఇంటి వద్ద కిడ్నాప్ చేసి భీమవరం రూరల్ మండలంలోని అతని స్వగ్రామం తాడేరు తీసుకువెళ్లాడు. అదే రోజు రాత్రి ఆమెను వివాహం చేసుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె 22న అతని నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుని తండ్రి, బంధువుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అత్యాచారం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటల్లోపే అతనిని అరెస్టు చేశాడు. శనివారం కోర్టు ముందు హాజరు పరుచుతామని తెలిపారు.

**ఉపాధ్యాయుడి సస్పెన్షన్**

ఉపాధ్యాయుడు సోమరాజును సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ గురువారం తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

దెందులూరు: మద్యం మత్తు, అతివేగం కారణంగా ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గుండుగొలను గ్రామం నుంచి బస్టాండ్ వైపునకు వస్తున్న ముగ్గురు యువకులను ఏలూరుకు చెందిన పేరిచర్ల సాయి ప్రసాద్ మద్యం మత్తులో కారుతో రాంగ్ రూట్‌లో వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో గుంటూరు వైద్యశాలకు తరలించారు. అలాగే తాడేపల్లిగూడెం వైపు నుంచి బైక్‌పై వస్తున్న పూళ్ళ పంచాయితీ తోకలపల్లికి చెందిన భార్యభర్తల్ని సాయి ప్రసాద్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భర్త మోరు దుర్గారావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ఈశ్వరమ్మ తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు వైద్యశాలకు తరలించారు.

## సైన్స్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక

ఉంగుటూరు: జిల్లా స్థాయిలో ఈ నెల 22న జరిగిన జిల్లా 31వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్‌లో తాడిచెట్ల తోట సాగు – భవిష్యత్ నూతన వ్యవసాయ విధానంపై కైకరం విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్టు తయారుచేసిన విద్యార్థులు నెరుసు సుమలత, పాదుగు సాయిచరణ్‌ను గురువారం హైస్కూలులో అభినందించారు. గైడ్ చేసిన ఉపాధ్యాయులు కె.జాన్‌ను హెచ్ఎం ప్రసాదరావు అభినందించారు.

## సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

తణుకు టౌన్: ఈ నెల 21, 22 తేదీల్లో ఏలూరులోని సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ యూనివర్సిటీ వాలీబాల్ జట్టు ఎంపికలో తణుకు మహిళా కళాశాల విద్యార్థినులు పి.రమ్య, వై.భూమిక, యూఎన్‌డీ భవానీలు పాల్గొని యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ తెలిపారు. జట్టుకు ఎంపికైన విద్యార్థినులు డిసెంబరు 8 నుంచి 12వ వరకు తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ వాలీబాల్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### కొమ్ముగూడెం సొసైటీని పరిశీలించిన కేంద్ర బృందం



సొసైటీ కార్యకలాపాలపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం సభ్యులు

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని కొమ్ముగూడెం విశాల సహకార పరపతి సంఘాన్ని గురువారం కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకు చెందిన అధికారుల బృందం పరిశీలించింది. ఈ బృందంలో ఆప్కాబ్, డీసీసీబీ, నాబార్డు, కో ఆపరేటివ్ విభాగాలకు చెందిన 16 మంది సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యకలాపాలపై వారు ఆరా తీయగా, సొసైటీ సీఈవో కృష్ణ శర్మ వివరించారు. అనంతరం సొసైటీ లాకర్ రూమ్, డిపార్ట్‌మెంటల్ స్టోర్, పశువుల దాణా తయారీ కేంద్రం, ఎరువులు, పురుగుమందుల గోడౌన్, నర్మద వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. వారి వెంట సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, సీఈవో కృష్ణశర్మ, నరేంద్ర తదితరులు ఉన్నారు.

### సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు

**అత్తిలి:** బ్యాంకు ఖాతాదారులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అత్తిలి బ్రాంచ్ మేనేజర్ టి.శ్రీనివాసరావు కోరారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం నాబార్డు వారి సౌజన్యంతో గురువారం అత్తిలి డీసీసీబీ బ్రాంచ్‌లో సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫోన్లు చేసి బ్యాంకు వివరాలను తెలుపమనే వారిని అస్సలు నమ్మవద్దని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ ఖాతాదారులకు బ్యాంకు తరఫున సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆర్ఎస్‌వీబీ కుమార్, ఎస్‌వీవీ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి



అప్పారావుపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ కేవీవీఎస్ ప్రసాద్

**తాడేపల్లిగూడెం రూరల్:** లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ కేవీవీఎస్ ప్రసాద్ అన్నారు. ఆవాస్‌దివాస్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ఇంటి నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 595మంది లబ్ధిదారులకు సంబంధించి ఇంటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణాలకు మెటీరియల్, బిల్లులు సకాలంలో అందిస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని త్వరితగతిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ ఏఈ వైవీ వెంకట్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### కవి ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం



కవి ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

**తణుకు:** శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో నిర్వహించిన 125వ శతాధిక కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. వేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కవిసమ్మేళనంలో కవి ప్రసాద్ చదివి వినిపించిన ఓటు ఒక క్లౌ జ్జర్ బాంబు శీర్షికతో కవితకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సంస్థ అంతర్జాతీయ సమన్వయకర్త కె.రమావతి, కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పలువురు ఆయనను అభినందించారు.

### నేడు డీఆర్‌డీఏ ఆధ్వర్యాన మినీ జాబ్‌మేళా

**ఇరగవరం:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, ఆ పై చదువులు చదివిన 21 గ్రామాల్లో ఉన్న 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల లోపు ఉన్నా నిరుద్యోగులకు అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చి వారికి జాబ్‌లు ఇప్పిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు.

# సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యం

**పెంటపాడు:** పేదల సంక్షేమం, అభివృద్ధి సీఎం జగనన్న ద్వారానే సాధ్యమని వైఎస్సార్ సీపీ యువ నేత కొట్టు విశాల్ అన్నారు. గురువారం రాత్రి పెంటపాడు మండలం మౌంజీపాడు, ఉమామహేశ్వరం గ్రామాలకు సంబంధించి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ఎంపీపీ దాసరి హైమావతి హాజరు కాగా, విశాల్ మాట్లాడుతూ నేడు ప్రజలంతా జగన్ వైపు ఉన్నారన్న అక్కసుతో ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. ప్రతిపక్షాలు అధికారంలోకి రావడం సాధ్యపడదన్నారు. రాబోయే ఎన్నికలలో నూటికి నూరుశాతం ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉమామహేశ్వరంలో పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. సచివాలయం వద్ద పథకాల లబ్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్ష, గౌరవాధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, సచివాలయాల కన్వీనర్ మైలవరపు పెదబాబు, ఏఎంసీ డైరెక్టర్ మద్దుకూరి సుబ్బలక్ష్మి, సర్పంచ్ మద్దుకూరి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు నంద్యాల వెంకన్నబాబు, ఈవోపీఆర్డీ ప్రసాద్, శివారెడ్డి, గ్రామ వాలంటీర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం గృహసారథులకు బ్యాగులు అందజేశారు. ఇంటింటికి వెళ్లి వలంటీర్లు, గృహసారథులు కలిసి బ్రోచర్‌లను అందజేశారు.



పెంటపాడు: మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్, పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ సంపత్ కుమార్



తాడేపల్లిగూడెం రూరల్: మోదుగగుంటలో పథకాలను వివరిస్తున్న వైస్ ఎంపీపీ రంగబాబు, సొసైటీ చైర్మన్ నరేంద్ర కుమార్



తాడేపల్లిగూడెం అర్బన్: 14వ వార్డులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

**ప్రజల కష్టాల్లో అండగా నిలిచిన సీఎం జగన్**

**తాడేపల్లిగూడెం రూరల్:** కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అని వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని మోదుగగుంట గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద వివిధ సంక్షేమ పథకాల బ్యానర్‌ను, వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగబాబు మాట్లాడుతూ దళారీలకు తావు లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా వారి ఖాతాకు జమ చేస్తున్నారన్నారు. గత నాలుగున్నరేళ్లలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలన్నీ జన్మభూమి కమిటీలు, నాయకుల జేబుల్లోకి వెళ్లాయన్నారు. జగన్ ప్రభుత్వంలో వాటికి తావు లేదన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ రాష్ట్రానికి సీఎం జగన్ అవసరాన్ని ప్రజలకు తెలియజెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టా సత్యవతి, ఎంపీటీసీలు దండుబోయిన విజయదుర్గ, మార్లపూడి సుబ్బారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, నాయకులు కామన చంద్రరావు, కట్టా జానకీరామయ్య, ఏపూరి సత్యనారాయణ, చిల్లిముంతల మారియ్య, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్‌కు జగన్ కావాలి**

**తాడేపల్లిగూడెం అర్బన్ :** స్థానిక 14వ వార్డులో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ కన్వీనర్ కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలందరూ మళ్లీ జగనే రాష్ట్రానికి కావాలని కోరుకుంటున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సంతోషకరమైన జీవితాన్ని అందించడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఇది గమనించిన ప్రజలు జగన్‌నే కోరుకుంటున్నారని చెప్పారు. అనంతరం మా నమ్మకం జగన్ కిట్లను పంపిణీ చేశారు. వార్డు ప్రజలు జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గుండుబోగుల నాగు, మారిశెట్టి రమణ, నీరుకొండ పండు, మిద్దె ఆదినారాయణ, బోణం విజయ నిర్మల, దింటకుర్తి లీలావతి, మానికొండ వెంకటేశ్వరరావు, సందనాటి నాగరాజు, బొద్దాని శ్రీనివాస్, చామన సూచ్యచంద్రరావు, వట్టి బుజ్జి జి అడ్డాల నరసింహారావు, యజ్జల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలు చరిత్రాత్మకం**

**తణుకు అర్బన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ పట్టణ జేసీఎస్ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ అన్నారు. తణుకు 29వ వార్డులో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ సచివాలయంలో సంక్షేమ పట్టికను ప్రారంభించి, అనంతరం పార్టీ జెండా స్థూపాన్ని ఆవిష్కరించి జెండా ఎగురవేశారు. పార్టీ శ్రేణులు ఇంటింటింటికి వెళ్లి జగనన్న పాలనపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఏఎంసీ డైరెక్టర్ పుల్లెపు సూర్యచంద్రరావు, నాయకులు నల్లూరి చంద్రశేఖర్, రేలంగి రాంబాబు, జిలాని, ఉండ్రాజవరపు గీత, వై.రామకృష్ణ, మండ సూరిబాబు, తలపాకుల రాము తదితరులు పాల్గొన్నారు.

**ముద్దాపురంలో..**

**తణుకు టౌన్:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి కావాలని తణుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి చెప్పారు. గురువారం సాయంత్రం తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ రుద్ర ధనరాజు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు కామన కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు తుమ్మగంటి నాగ సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు సైదు త్రిమూర్తులు పాల్గొన్నారు.

**ఈడూరులో...**

**అత్తిలి:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతీ కుటుంబానికి వివరించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని ఈడూరు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ ఎగురవేశారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ మంతెన రామలింగరాజు, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పెన్మెత్స రామరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు దారాబత్తుల రామాంజనేయులు, మద్దాల శ్రీనివాస్, కోరుకొల్లు వెంకట్రావు పాల్గొన్నారు.

**ఓగిడిలో..**

**ఇరగవరం:** మండలంలోని ఓగిడి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డులను, పార్టీ జెండాను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సచివాలయ పరిధిలో రూ.11కోట్లు, 68లక్షల, 2వేల 137 ఖర్చు చేశామని వివరించారు. అనంతరం ఓగిడి గ్రామంలోని 600మంది ఆయుష్మాన్ లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, జేసీఎస్ కన్వీనర్ దినేష్ రెడ్డి, సర్పంచ్ ఘంటా సురేఖ, మధుబాబు, ఎంపీటీసీ భారతి పాల్గొన్నారు.



తణుకు అర్బన్: 29వ వార్డులో బ్రోచర్ అందిస్తున్న నాయకులు



తణుకు టౌన్: ముద్దాపురంలో మాట్లాడుతున్న బోడపాటి వీర్రాజు



అత్తిలి: ఈడూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో బ్రోచర్‌లు అందజేస్తున్న నాయకులు

# ఆడపిల్ల చదువు భావితరాలకు వెలుగు



తాడేపల్లిగూడెం (టీఓసీ): బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు, ఏఎన్ఎం, ఆశాలు, విద్యార్థులు



తణుకు టౌన్ : దువ్వ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ఆడపిల్ల చదువు భావితరాలకు వెలుగు అని ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీలు మంజుల, ఝాన్సీ, కళ్యాణి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు గురువారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్ల మగపిల్లల కంటే ఏ మాత్రం తక్కువ కాదన్నారు. ప్రతి ఆడపిల్ల విలువైనదని, ఆడపిల్లను చదివించి దేశాన్ని బలోపేతం చేయాలని కోరారు. నేడు బాలికలు చదువు, ఉద్యోగాల్లో ముందంజలో ఉంటున్నారని, మరింత ముందుకు సాగాలన్నారు. బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎన్ఎం లక్ష్మీకళ, అంగన్‌వాడీ టీచర్లు తెన్నేటి అరుణేశ్వరి, కొడమంచిలి జయ, ఆశా వర్కర్లు సుహాసిని, ఛాయా కుమారి, కృపావతి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

**బాలికల సమగ్రాభివృద్ధికి కృషి**

**తణుకు టౌన్:** బాలికల సమగ్ర అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మీ చెప్పారు. గురువారం మండలంలోని దువ్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో–బేటి పడావో కార్యక్రమంలో ఆమె వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

**అత్తిలిలో..**

**అత్తిలి:** బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి చెప్పారు. గురువారం అత్తిలి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బేటి బచావో–బేటి పడావో కార్యక్రమంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా విజేత నాగరాజు, హెచ్ఎం జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అల్లుసలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని కృష్ణాపురం గ్రామంలో చెరువు గట్టున నూతనంగా నిర్మించిన ఆలయంలో అల్లుసలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి జెడ్పీటీసీ ముత్యాల అంజనేయులు, పలువురు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి జలాధివాసం నిర్వహించారు. పరిసర గ్రామాల మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలను వీక్షించారు.

### పరీక్షా పత్రాల అందజేత

**తాడేపల్లిగూడెం రూరల్:** అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఈనెల 24వ తేదీ నుంచి జరగనున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలకు సంబంధించి ప్రశ్నా పత్రాలను గురువారం మండల పాయింట్ నుంచి ఎంఈవో పీఎంకే జ్యోతి స్కూల్ కాంప్లెక్స్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశిత పరీక్ష తేదీన ఒక గంట ముందు ప్రశ్నా పత్రాలను కాంప్లెక్స్ నుంచి అధీకృత పత్రంతో తీసుకోవాలన్నారు. మూడు నుంచి తొమ్మిదోవ తరగతి వరకు టోఫెల్ ప్రశ్నా పత్రాలను అందించినట్లు తెలిపారు. ఎస్ఏ 1 పరీక్షలను కాల నిర్ణయ ప్రకారం నిర్వహించి, మార్కులను రికార్డులో, ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట సీఆర్‌పీ బత్తుల నానిబాబు ఉన్నారు.

### ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

**భీమవరం:** ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీ ల్లో భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని కళాశాల పీడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఎం.శివ రోహిత్, ఎస్.అమన్ సంతోష్, బీహెచ్ వెంకటేశ్వర నాయక్ ఎంపికైనట్లు చెప్పారు. వీరు డిసెంబర్ మొదటి వారంలో కేరళలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

**పాలకోడేరు:** మోగల్లు జగనన్న కాలనీలో ముంపు సమస్యను పరిష్కరించేందుకు రూ.3.60 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజు తెలిపారు. గత కొంత కాలంగా జగనన్న కాలనీకి సమీపంలో ఉన్న మురుగు డ్రెయిన్ పూడుకుపోవడంతో కాలనీ ముంపునకు గురవుతోంది. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక మహిళలు రోడ్డుపై బైఠాయించారు. అదే దారిలో వెళ్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌ను ఆపి తమ సమస్యను వివరించారు. స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్రెయినేజీ శాఖ అధికారులు కాలనీని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

### క్రిమినల్ కేసుల రాజీకి కృషి చేయాలి

**భీమవరం:** వచ్చేనెల 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ చేసే దిశగా పోలీసులు కృషి చేయాలని భీమవరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు సూచించారు. గురువారం జడ్జి ఛాంబర్‌లో భీమవరం, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు, వీరవాసరం పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల్లోని ఇరుపక్షాల కక్షిదారులను సమన్వయ చేసి లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశాన్ని వివరించాలని, అలాగే లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించేందుకు మారుమూల గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. క్రిమినల్ కేసులతో పాటు సివిల్ తగాదాలు, చెక్ బౌన్స్, మనోవర్తి కేసులు కూడా రాజీ చేసుకోవచ్చనని సురేష్‌బాబు వివరించారు. సమావేశంలో భీమవరం రూరల్, ఆకివీడు, పాలకోడేరు, వీరవాసరం ఎస్సైలు వై.సత్యకృష్ణ, కేవీ సత్యనారాయణ, ఎన్.శ్రీనివాసరావు, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు తాడేపల్లిగూడెంలో మెగా జాబ్‌మేళా

**భీమవరం:** తాడేపల్లిగూడెంలోని డీఆర్ గోయాంక మహిళా కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యాన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, ఇన్నోవ్ సోర్స్, అపోలో ఫార్మసీ, ఎల్ఐసీ, యంగ్ ఇండియా, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంకు వంటి కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. వివిధ కంపెనీలలో సుమారు 700 ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఓటు నమోదు చేసుకోవాలి

**తణుకు టౌన్:** వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన విద్యార్థినీ, విద్యార్థులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ కోరారు. గురువారం ప్రత్యేక ఓటు నమోదు అవగాహనా కార్యక్రమం (స్వీప్)లో భాగంగా గురువారం తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును పొంది ఓటు హక్కు ద్వారా మన చుట్టూ ఉన్న సమాజాన్ని మార్చు తీసుకురావచ్చని చెప్పారు. కార్యక్రమాల్లో ఎన్నికల డీటీ బి.సూర్యనారాయణరాజు, టీపీఓ వై.శ్రీనివాసు పాల్గొన్నారు.

### సామాజిక సాధికారత సీఎం జగనన్నకే సాధ్యం

**పెంటపాడు:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల గుండెల్లో ఉన్నత స్థానాన్ని నిలుపుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సామాజిక సాధికారత సాధ్యమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గురువారం పెంటపాడు మండలంలో జరిగిన మాలమహానాడు అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంగ్లీష్ మీడియం, నాడు–నేడు, వలంటీర్ల వ్యవస్థతో జగనన్న ముందుకు దూసుకు పోతున్నారన్నారు. మరోపక్క సామాజిక సాధికారత పేరుతో రాష్ట్రంలో చేపట్టిన బస్సుయాత్రకు అనూహ్య స్పందన వస్తోందన్నారు. కాగా టీడీపీ, జనసేన అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికలకు వచ్చినా ప్రజలంతా ఏకతాటిగా వైఎస్సార్ సీపీకి ఓటు వేయడం ఖాయమన్నారు. పార్టీ ఎస్సీసెల్ నాయకులు తాడేపల్లి ప్రేమ్‌కుమార్, ఉన్నమట్ల ఏసురత్నం, యూవీ రత్నం, సునీల్ పాల్గొన్నారు.

# రైల్వే ప్రైవేటీకరణను మానుకోవాలి



తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** రైల్వే ప్రవేటీకరణ చేయొద్దని, రైల్వేను కాపాడుకుందామని సీఐటీయూ నాయకులు, కార్మికులు నినాదాలు చేశారు. ప్రవేటీకరణకు వ్యతిరేకంగా తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ వద్ద గురువారం సీఐటీయూ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. నాయకులు చిర్ల పుల్లారెడ్డి, కర్రి నాగేశ్వరరావు, సిరపరపు రంగారావు మాట్లాడుతూ దేశంలో అతి చౌకయిన ప్రయాణం, సరుకుల రవాణా చేస్తున్న భారత రైల్వేల ధ్వంసానికి, లక్షల కోట్ల రైల్వే ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి బీజేపీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను వెనక్కి తీసుకోకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**తణుకు రైల్వే స్టేషన్ వద్ద..**

**తణుకు:** రైల్వే ప్రైవేటీకరణ ఆపకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ హెచ్చరించారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తణుకు స్టేషన్లో లిఫ్ట్ సౌకర్యం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, కామన మునిస్వామి, ఎస్.రమేష్, ఎన్.చిన్నారావు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు గ్రామస్తులు కొనియాడారు. లయన్ దాట్ల లక్ష్మీపతిరాజు దాతృత్వంతో పెంటపాడు మండలం పరిమళ్ళ గ్రామంలోని కై లాస భూమిలో సుమారు రూ.10 లక్షలు వెచ్చించి రెండు బీడు పొయ్యిలు, షెడ్డులతో ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు ప్రారంభించారు. అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాస్, పచ్చ వెంకటేశ్వరరావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే నిడదవోలులోని చర్ల సుశీల వృద్ధాశ్రమానికి రూ.5 వేలు అందజేశారు. వృద్ధులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

### 10న కాపు కార్తీక వనసమారాధన

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** తాడేపల్లిగూడెం నియోజకవర్గ కాపు కార్తీక వనసమారాధన మండలంలోని వెంకట్రామన్నగూడెం బండారు నాగన్న తోటలో వచ్చే నెల 10వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు కాపు నాయకులు నంద్యాల కృష్ణమూర్తి, మాకా శ్రీనివాస్, మారిశెట్టి అజయ్, యెగ్గిన నాగబాబు, జంగా రామ్‌రాయ్ వెల్లడించారు. పట్టణంలోని కాపు కళ్యాణ మండపం వద్ద జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కాపులు, మహిళలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.